# దాస్య విముక్తి

శ్రీ కె. సూర్యనారాయణశాస్త్రిగారు

మెల్లగా తెల్లవారింది. ప్రాక్పర్వతం మీద ఉద్భవించటానికి ప్రభాకరుడు ప్రాకులాడుతూ వున్నాడు. కాని నిజ తేజస్సు వసుధమీద ప్రసరింప చేయటానికి మనస్సులో సంకోచిస్తున్నాడు. వెల్లవేసిన పెద్ద గోడలాగ ఆకసమంతా తెల్లతెల్లటి మేఘాలతో వెల్లి విరిసి పోతోంది. చినుకులు చురుకుగా జోరవుతున్నాయి. పిల్లకాల్వలు తమ వుల్లాసమున వూగులాడుచూ, నీటి బిందువులను పిలుచుకుంటూ, తమ కనువైన పల్లపు ప్రదేశాన్ని ఆదేశిస్తూ, పరుగులెత్తుతున్నాయి. తేటనీటిమీద చిరస్థాయిగా తేలి ఆడుకుందామని ఆశకొద్దీ, పెద్ద పెద్ద బుడగలు, తమ భేషజ బింకాలను పైకి చూపిస్తూ, తాత్కాలిక సంతోషాలు నలువైపులా చిమ్ముతూ, నిష్ప్రయోజనమైన నిజదేహాలను అట్టే ప్రపంచానికి ఒక్కమారు చూపెట్టి, నిరాశతో నీటిలో కలిసి పోతున్నాయి. కాక బృందాలు భూరుహ పత్రాల మాటునుండి స్వేచ్ఛా విహారశూన్య విద్వేషాలతో, పక్షద్వయాన్ని ముడుచుకొని, బిక్కుమన్నట్టుగా చూస్తున్నాయి.

అటువంటి వర్షసమయంలో, ఆ పట్టణమునకు పశ్చిమ దిశలో ఒక పూరిగుడిసె పాడుబడిపోయివుంది. దాని చుట్టూ వున్న మొండిగోడలు, తిండిలేక మనిషి ఎండి వంగిపోయినట్లు మీదికి ప్రవహించే నీటినిచూచుకుంటూ, మరింతసిగ్గై తలలు దించుకుని, క్రుంగిచూస్తున్నాయి. వసారా మాటున చింపిరి మంచపు పక్కలో పడుకుని దీనవదనంతో గూటి వైపు చూస్తూ, గోళ్లు గిల్లుకుంటోంది శేషు. చెదిరిన శిరోజాలు చెక్కిళ్ళమీదికి ఎగురుతున్నాయి. పాఠశాలలో క్రిందటిసారి స్వాతంత్ర్యదినోత్సవ నాటకంలో తను ధరించిన భరత మాత పాత్రను తలుచుకుంటూ, నాడు తిరిగి తను నటించటానికి తగిన స్వస్థత చేకూరలేదుగదా! అని, నొచ్చుకుంటోంది. తను భరతమాత పాత్ర నిర్వహించిన ఛాయా పటమునకు అద్దము కట్టించిన రాముని, మనస్సులో తలుచుకుంటూ, కృతజ్ఞతతో సెమటు తెచ్చుకుంటోంది. మంచం క్రిందవున్న పెట్టెలో నుంచి ఆ ఛాయాచిత్రాన్ని తీసి చూసుకొని, లేని ఆనంద వికారాలతో దాన్ని తిలకిస్తూ, "భగవంతుడా! ఇంత శోభాయమానంగా, ఆహ్లాదంగా యీ 'భరత తల్లి' వేషాన్ని నటించటానికి నేడు నాకు హక్కు యివ్వ లేదూ? ఇంత అస్వస్థత చేకూర్చావు గదా? నేనే ఆ పాత్రను నటించటానికి తగిన నారీమణినని వేనోళ్ల పొగడబడి, యీ పతక ద్వయాన్ని పొందితినిగదా! ఏవీ" అని అనుకుంటూ, వానిని చేత్తో పుచ్చుకుని కళ్లకి అద్దుకుంది శేషు. శేషు పితృ, భ్రాతలు లేని అభాగిని, పేదరాలు పాపం! తల్లి దొడ్లో వసారాలో శేషుకి పథ్యపు కూడు వుడకేస్తోంది.

శేషును కూడా నాటకము చూడటానికై తీసుకుని రశ్మని యిద్దరు బాలికలను పంపాడు వుపాధ్యాయుడు. ఆ బాలికా ద్వయము అప్పుడే బయలుదేరి శేషువద్దకు వచ్చి నెమ్మదిగా పలకరించారు.

"శేషూ! నిద్రే! ఏం ఎట్లావుంది!" అని అడిగేరు.

"ఎవరూ? ఆశా రేఖా రా! రండి. ఇదిగో యిట్లా కూర్చోండి" అని తను ఒకవైపుకు జరిగింది. "ఆశా! ఏం నువ్వు వచ్చావేం! పాపం భాగ్యవంతురాలవైయుండి, నేనంటే ఎంత ప్రేమే నీకు. ఇదిగో ఆశా! యీ సారి భరత మాత ఎవరు వేస్తున్నారు?

"నీ ఒంట్లో ఎట్లావుంది శేషూ!"

"ఎట్లావుందని చెప్పనూ. స్వస్థత చేకూరుతోంది. కానీ, యీ సారి, నాటకంలో సంతోషంగా నటించటానికి శక్తి లేదు"! అంటూ కన్నీరు కారుస్తోంది.

"అదేమిటి శేషూ! తప్పు! అదిగో చూస్తున్నావుగా నీ ఛాయాచిత్రం. తప్పు, ఏడవకూడదు. నీ వల్ల మనస్కూలుకు ఎంత కీర్తివచ్చిందే! ఈ సారి నీవు మాత్రం ఏం చేస్తావు?" అని తన చేత్తో కన్నీటిని తుడుస్తూ, "నిన్నే పలుమార్లు తలుచుకుంటున్నారు హెడ్మాస్టారు. ఆ పాత్రవహించటానికి తగిన హావ భావ, మృదు వచనాలు నాలుగూ నీవే చెప్పాలట. ఆ ఆశీర్వచన గీతం నీవే చదవాలట. ఆ

పాత్ర రక్తి కట్టించగల శక్తి నీలో వుందట. కానీ, ఆయన మాత్రం ఏం చేస్తారు? నీకు అనారోగ్యం, పాపం. ఈ సారి వేణు వేస్తోంది ఆ వేషం, తెలుసా. అందరూ ఛా అంటున్నారు ఆ పద్యం విని. శేషూ, మేం వెళ్లొస్తాం. సాయంత్రం మూడు గంటలకు వస్తాం. నిన్ను బండిమీద కూర్చోబెట్టుకుని నాటకానికి తీసుకురమ్మన్నారు మేష్టారు. ఎట్లాగైనా నీవు తప్పకుండా రావాలి. ఏమీ లేదు, ఊరికే అక్కడ కూర్చోటానికేలే"

"సరేలే, ఆ మాత్రం ఓపికవుంటే నేను రాకుండా వుంటానా? వెడుతున్నారా! పాపం"

'మరి, వస్తాం గుడ్ బై' అని శేషు దక్షిణహస్తాన్ని మృదువుగా స్పృశించి నిజ పాఠశాలోన్ముఖులై వెళ్లిపోయారు వాళ్లిద్దరూను.

తల్లి గంగమ్మ, రేకు కంచంలో పథ్యపుఅన్నం కలిపి, శేషు వద్దకు తీసుకువచ్చి "అమ్మా! యిదుగో తిను, ప్రొద్దుపోయింది. నీవు బళ్లోకి వెళ్లకపోవటంవల్ల ప్రొద్దు తెలియటం లేదు. ఎవరు ఇప్పుడు వచ్చింది, శేషూ...?

"నా స్నేహితులే. ఆశా రేఖా, గీతా రేఖా అని, వాళ్లిద్దరు అప్పచెల్లెళ్లు. వీళ్ళన్న గారు రామూ. అతను చాలా మంచివాడు, ఉదారహృదయుడును. లక్షాధికారులు వాళ్లు. పాపం నేనంటే ఎంతో ప్రేమ. సాయంత్రం నాటకానికి నన్ను మేష్టారు తీసుకురమ్మన్నారట. అది చెప్పటానికి వచ్చారు. సరేనని ఒప్పుకున్నాను" అంది శేషు.

'నడవగలవా అమ్మాయీ?'

"అచ్చే! బండి తీసుకువస్తారట. అందులో రమ్మన్నారు" అంటూ, కంచం దగ్గరకు తీసుకుని, చప్పిడి దవడలతో, వున్న శక్తి వుపయోగిస్తూ, వుడికిన అన్నాన్ని తింటోంది శేషు.

"పాపం! ఎంత అపేక్ష నీమీద" అని, సంతోషంతో యింట్లోకి పోయి గృహ కృత్యాలను చేయ మొదలిడింది గంగమ్మ.

మధ్యాహ్నం 12 గంటలయింది అని విశద పరచటానికి వూరి మధ్యలోవున్న నూనెయంత్రం 'భోంయ్' మంటూ ఆకలిగొన్న ఆడరక్కసిలాగ అరుస్తోంది. వర్షాధిపతి తన అలసట తీర్చుకోవటానికి తన చక్రాన్ని అడ్డుగా వదిలేడు. లోకంలోని స్వతంత్ర సంతోషాలు చూచి సంతోషిద్దామని తన రథాన్ని తొందరగా తోలుతున్నాడు లోక బాంధవుడు. భోజనానంతరం శేషు 'దాస్య విముక్తి' పుస్తకాన్ని తనహీనస్వరంతో పారాయణం చేస్తోంది. ఆశా గీతలు శేషు యింటికి బయలుదేరారు.

స్వాతంత్ర్య సంతసం వెలిబుచ్చటానికి పాఠశాల మందిరం నయనానందంగా అలంకరించారు. నిత్య కళ్యాణ శోభ వెదజల్లేటట్లు పచ్చటితోరణాలు పాఠశాల నిండా కట్టారు. తెల్లకాగితాలపైన 'వందేమాతరం' 'మనదేరాజ్యం' 'సకల జీవములు సమానమే' 'సత్యాహింసలు ఆచరించండి' అని వ్రాసి ప్రతిగోడకీ, ప్రతిస్తంభానికి అంటించారు. మన భరతదేశ ఆచరణలను ప్రతి భారతీయునికి త్రికరణ శుద్ధిగా బోధచేయుటకుగాను త్రివర్ణపతాకాలను యింపుగా అంటించారు. పాఠశాలనిండా ప్రేక్షకులకు ప్రీతిగొలుపునట్లు, చిత్రకళా నైపుణ్యము ముప్పిరిగొన్నది. నూతన స్వదేశ ఖద్దరు కర్టెన్లతో, భారతదేశయోధుల పవిత్రపటములతో, నాటక వేదిక పొందుపరిచారు. మధ్యాహ్నం రెండుగంటలు అయ్యేసరికి 'రత్నగర్భ, పరమ పవిత్ర పుణ్యచరిత' అయిన మన 'భరతమాత' ఫోటోను, భరతమాతకు కడుంగడు గారాబు బిడ్డ 'గాంధీజీ' ఫోటోను, మాతృదేశ సేవా ధురంధరులు 'నెహ్రూ, పటేల్, ఆజాద్, సుభాస్, కస్తూరిబా మొదలయిన వారి చిత్ర పటములను, స్వదేశ నూలుతో అల్లి అమర్చబడ్డ హారములతో అలంకరించి, వివిధ వాయిద్యములతో, కర్పూరహారతీ జ్యోతులతో, భద్రదంతావళం మీద పట్టణమంతా వూరేగించారు. భారతపిత గాంధిజీ లేని లోపమును వెలిబుచ్చటానికి అప్పుడే ఒక చిన్న వర్షం కురిసి వెంటనే వెలిసింది.

ఊరేగింపు పూర్తికాగానే గొప్ప గొప్ప వుద్యోగస్థులు, మాతృదేశ సేవకులు, భరతమాత దాస్య శృంఖలా విచ్ఛేదకులూ మొదలైన వారంతా నాటక దర్శనార్థం వచ్చారు. 'దాస్య విముక్తి' అనే నాటకాన్ని బాలికా మణులచే సొంపైన వాచాలతలతో, ఇంపైన గీతములతో, మనోరంజకమైన నటనలతో—తొల్లి భరతమాత అనుభవించిన కష్ట

ములు—భారతీయుల బానిస బాధలు—దాస్య దశ—దాస్య విముక్తి—మాతృదేవతాశీర్వచన మొదలైన ఘట్టములచే ప్రదర్శింపబడింది. చూపరులు విసుగు చెందక తదేక దీక్షతో అవలోకిస్తున్నారు. శేషు, దీనంగా ఒక బల్లమీద ఆసీనురాలై చూస్తోంది. సభాధ్యక్షునకు అభిముఖుడై ప్రధానోపాధ్యాయుడు నిలబడి

“మహాశయులకు మనవి:—

ఈ దాస్య విముక్తి నాటక ప్రదర్శనమునకు ముఖ్యోద్దేశమేమిటంటే; మన భరతమాత సుమారు 65 సం॥ నుండి దీనావస్థ, పుత్రశోకము, దేశఘోష, బానిసత్వము, అనుభవించి, నేటికి దాస్యవిముక్తి చెందినది. మనము స్వాతంత్ర్యము పొందిన నేడు చాలా సుదినము. మన భరతమాత మనము సకల ఆయురారోగ్య శుభసంతోష సంపదలు పొందుగాక యని ఆశీర్వదించినట్లు, మనము పొందిన స్వాతంత్ర్యమును, కాబోయే పౌరులైన మీ రందరూ అనుభవిస్తూ, మాతృదేశ సేవా పరాయణులై, తరతరాల అనుభవింపచేస్తూ యిటువంటి సుదినోత్సవాలు ప్రతి వర్షము జరుగవలెనని ఆశిస్తున్నాను—మరొకటి—

చిరంజీవి శేషు నేడు భరత మాత పాత్రిణి కావలసింది. ఆమె ఆ పాత్ర ధరించినపుడు ఆ శాంతియుత నయనాలు, చిఱునవ్వులు విరజిమ్మ చిన్న పెదిమెలు, ఉదార దృష్టి, శిరోజసౌందర్యము, మృదుమధురమైన వాక్సంపుటి, ఆ ఆశీర్వచన గీతమునకు తగిన మందహాసయుక్త సున్నిత గళము యింకా ఎన్నో బాగా నాటకాన్ని రక్తికట్టించేవి. తీర్చిదిద్ది తిలకం పెట్టినట్లు, అవసరంకొద్దీ అవతరించిన భరత మాతలా ఒప్పేది శేషు. కాని నేటికి ఆమె అస్వస్థగా వుండడమే ఆమె నటించక పోవటానికి కారణం. ఆమె నటించక పోవటంవల్ల నా మనస్సు చాలా బాధపడుతూ ఉంది.

ఇదిగో మామూలుగా మన పాఠశాల తరఫున శేషు భరత మాతపాత్ర ధరించినట్లుగా భావించి యీ రెండు పతకాలను బహూకరిస్తున్నాను” అని ఆ రెండు పతకములనును ఆమెకిచ్చాడు హెడ్మాస్టారు. తరువాత, సభవారికందరికి అభివందనాలర్పించాడు ఆయన. చూపఱులందరికీ తీపి మిఠాయిలు పంచిపెట్టించి సాతంత్ర్యరుచి చూపెట్టాడు. నాటకం పూర్తయింది. ఇద్దరు ముగ్గురు వుపన్యాసా లిచ్చారు స్వాతంత్ర్య విశిష్టతను గురించి. సభంతా ముగిసింది. శేషు వున్న ఓపికతో, భరత మాతకు—దేశోద్ధారకులకూ కమ్మటి పాట పాడి కర్పూర హారతి యిచ్చింది. అందరూ, కళ్లకు అద్దుకుని వెళ్ళిపోయారు. ప్రధానోపాధ్యాయునివద్ద సెలవు పుచ్చుకొని, స్నేహితులతో బయలుదేరి శేషు కూడా యింటికి వెళ్ళింది, బండి మీద. ఈ సంగతి తల్లితో చెప్పి ఎంతో సంతోషించింది.

భరతమాత దాస్య విముక్తి చెందినట్లుగానే—తొలుత తనకు ఫోటో కట్టించి యిచ్చిన స్నేహితుడు రామాను అనగా, ఆశాగీతల అన్నగార్ని వివాహమాడి పేదరికంబాసింది మొన్న ఈ మధ్యనే, శేషు.

★

## మా చందాదార్లకు

“ఆంధ్ర మహిళ” పత్రిక ప్రతి నెలా 1 వ తేదీకి వెలువడుచున్నది. సామాన్యంగా ప్రతినెలా 5 వ తేదీ నాటికి పత్రిక చందాదార్లకు అందు ఏర్పాట్లు చేయబడ్డాయి. అందువల్ల, 10 వ తేదీ నాటికి పత్రిక అందనిచో, వెంటనే మాకు తెలుపవలసినదని మా చందాదార్లను కోరుచున్నాము. తమ తమ ఊళ్లయందలి తపాలా ఆఫీసులలో గూడ పత్రికలు సక్రమముగా తమకు జేరునట్టి కట్టుదిట్టములను చేసికొనవలెనని హెచ్చరించుచున్నాము. ముఖ్యమైన సంచికలు తరచు చందాదార్లకు అందుటలేదని తెలియవచ్చుచున్నది గనుకో యీ ప్రకటన యగత్యమైనది. ఏ పరిస్థితిలోనైనా, 10 వ తేదీకి పత్రిక అందనిచో వెంటనే “ఆంధ్ర మహిళ” కార్యాలయమునకు జాబు వ్రాసినచో వేరు పత్రిక పంపబడును.

—మేనేజరు